ప్రజాశక్తి
ఆదివారం 8 డిసెంబర్ 2024 5 శ్రీ సత్యసాయి

లక్ష్యానికి దూరంగా రిజిస్ట్రేషన్లు

◆ ఇప్పటికి 64.50 శాతమే...
◆ నిరాశాజనకంగా రియల్ఎస్టేట్ వ్యాపారం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూముల రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగుతున్నాయి. వార్షిక లక్ష్యానికి దూరంగా రిజిస్ట్రేషన్ల ఆదాయముంటోంది. గత కొన్ని రోజులుగా రియల్ఎస్టేట్ వ్యాపారం నిరాశజనకంగా ఉంటోంది. ఆ వ్యాపారంపై ఆధారపడిన వ్యాపారులు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. ముందులాగా అమ్మకాలు, కొనుగోళ్లు సాగడం లేదని చెబుతున్నారు. రియల్ వ్యాపారం మందకొడిగా ఉంటోందంటున్నారు. అందుకు తగ్గట్టుగానే రిజిస్ట్రేషన్ల ఆదాయంలోనూ ఇది స్పష్టంగా కనిపిస్తోంది. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వం ఊహించినంతగా ఆదాయం రావడం లేదు. నత్తనడకన రిజిస్ట్రేషన్లు సాగుతున్నారు. అనంతపురం జిల్లాలో ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు చూస్తే లక్ష్యంలో 64.50 శాతమే చేరుకోవడం జరిగింది.

అనంతపురం జిల్లాలో మొత్తం 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి వార్షిక లక్ష్యం రూ.469.65 కోట్లు ఉంది. అందులో నవంబర్ వరకు చూస్తే రూ.300.57 కోట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం చూస్తే రూ.193.86 కోట్లు మాత్రమే. అంటే నవంబర్ వరకు రావాల్సిన ఆదాయంలో 64.50 శాతమే వచ్చింది. అదే వార్షిక లక్ష్యంతో పోల్చి చూసినప్పుడు 41.27 శాతమే ఆదాయం సమకూరింది. వచ్చే నాలుగు మాసాల్లో 59 శాతానికిపైగా ఆదాయం ప్రభుత్వానికి సమకూరాల్సి ఉంది.

కణేకల్ ప్రథమం- తాడిపత్రి అధమం..

అనంతపురం జిల్లాలో 12 రిజిస్ట్రేషన్ శాఖల పరిధిలో చూసినప్పుడు లక్ష్యానికి చేకూరే విషయంలో కణేకల్ కొంత మెరుగ్గా ఉండగా తాడిపత్రి చివరి స్థానంలో ఉంది. కణేకల్‌లో నవంబర్ వరకు లక్ష్యం రూ.7.37 కోట్లకుగానూ రూ.5.70 కోట్లు ఆదాయం సమకూరింది. ఆ తరువాతి స్థానం ఉరవకొండ ఇక్కడ రూ.10.21 కోట్లకుగానూ రూ.7.89 కోట్ల ఆదాయం సమకూరింది. లక్ష్యంలో 77.31 శాతం చేరింది. అనంతపురం రూరల్ లక్ష్యం రూ.54.51 కోట్లకుగానూ రూ.40.63 కోట్లు ఆదాయం సమకూరింది. అంటే 74 శాతం లక్ష్యం చేరింది. అనంతపురం నగరంలో రూ.101.66 కోట్లకుగానూ రూ.64.44 కోట్లు ఆదాయం వచ్చింది. 63 శాతం లక్ష్యం చేరింది. గుత్తి రూ.13.89 కోట్లకుగానూ రూ.9.50 కోట్లు, 68.42 శాతం, శింగనమల రూ.8.52 కోట్లకుగానూ రూ.5.45 కోట్లు, రాయదర్గం రూ15.42 కోట్లకుగానూ రూ.116.6 కోట్లు, 75.61 శాతం, గుంతకల్లు రూ21.52 కోట్లకుగానూ రూ.13.30 కోట్లు, 61.77 శాతం, యాడికి రూ.4.95 కోట్లకుగానూ రూ.2.75 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. అంటే లక్ష్యంలో 55 శాతమే వచ్చింది. పామిడిలో రూ.10.24 కోట్లకుగానూ రూ5.34 కోట్లు 52.16 శాతం లక్ష్యం చేరుకుంది. ఇక అన్నింటికంటే తాడిపత్రి అతి తక్కువ ఆదాయం సమకూరిన దాంట్లో ఉంది. ఇక్కడ లక్ష్యం రూ.37.12 కోట్లకుగానూ రూ.18.28 కోట్లు మాత్రమే ఆదాయం సమకూరింది. లక్ష్యంలో 49 శాతమే చేరుకుంది.

చిలమత్తూరు మండలం కొండికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సోమందేపల్లిలో విద్యార్థులతో కరచాలనం చేస్తున్న మంత్రి సవిత

కూడేరులో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ సందర్భంగా నృత్యం చేస్తున్న విద్యార్థిని

'పాఠశాలల్లో పండుగ'

◆ ఉత్సాహభరితంగా పేరెంట్స్, టీచర్స్ మెగా మీటింగ్
◆ పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు
◆ పాఠశాలల్లో తల్లిదండ్రులకు ఆటల పోటీలు

కొడికొండలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-శ్రీసత్యసాయి జిల్లా యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పాఠశాలలో సమావేశం అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్సాహభరితంగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించేలా కొత్త కార్యాచరణకు పిలుపునిచ్చింది. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులు చదువులు, మౌలిక వసతులు తదితర వాటిని చర్చించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో అధికారులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి వారి నుంచి సూచనలు తీసుకున్నారు. అక్కడి సమస్యలను పరిష్కరించేందుకు ఉమ్మడి కార్యచరణను చేపట్టారు. ఇదే సమయంలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి ఉత్సాహపరిచారు.

సోమందేపల్లి మండలం కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో రాష్ట్ర బిసి, చేనేత జౌళి సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోందని దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేశారు. పెనుకొండ జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బికె.పార్థసారధి పాల్గొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు, పుట్టపర్తి, ఓడీసీ మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో విద్యను అభ్యసించి సక్రమమైన మార్గంలో తమ భవిష్యత్‌ను అందంగా మార్చుకోవాలని, మొబైల్‌ను అతిగా వాడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎమ్మెల్యే సింధూరారెడ్డి సూచించారు. కదిరి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలకు సమాజం పట్ల బాధ్యత పెంపొందించేలా సూచనలు చేస్తూ మార్గదర్శకులుగా ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం కలిగి ఉండాలని విద్యార్థులు సరైన మార్గంలో ముందుకు సాగేందుకు ఉపాధ్యాయులు తల్లితండ్రులు వారిపై దష్టి సారించాలన్నారు. రామగిరి మండలం కుంటిమద్ది గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్న సందేశంతో రూపొందించిన మాదక ద్రవ్యాలు వద్దు బ్రో అనే పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం తల్లిదండ్రులకు నిర్వహించిన పోటీలను ఆమె తిలకించారు. మడకశిర మండలం బుల్లాసముద్రం జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుముల తిప్పస్వామి పాల్గొన్నారు. బుల్లాసముద్రం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎక్కడా లేనవిధంగా ఆడపిల్లలకు రెస్ట్ రూమ్‌ని ప్రారంభించారు. చిలమత్తూరు మండలం కొండికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ టిఎస్.చేతన్, డిఇఒ కృష్ణయ్య పాల్గొన్నారు. కోడూరు జడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కలిసి విద్యా బోధనలపై ఆరా తీశారు. విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటం సమిష్టి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల స్థానంలో సమగ్ర విద్యా ప్రగతి పత్రాలు పంపిణీ చేశారు. ధర్మవరం బిఎస్ఆర్ బాలికల ప్రభుత్వ పాఠశాల నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ వి.రత్న పాల్గొన్నారు. అందరూ సమిష్టి కృషితో డ్రగ్ అనే మత్తు పదార్థాన్ని పారదోలుదామని ఎస్పీ పిలుపునిచ్చారు.

విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

కుంటిమద్ది పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత

మాట్లాడుతున్న పల్లె సింధూరారెడ్డి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన

లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మడకశిర

ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

స్థానిక పెనుకొండ రోడ్డులోని అగ్రికల్చర్ డిప్లొమో కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌పై తక్షణమే పోక్సో కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని అమరాపురం బస్టాండ్‌లో విద్యార్థుల తో కలిసి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ డిప్లొమో కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాక ఓ విద్యార్థినిని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. కళాశాల యాజమాన్యం ఆ లెక్చరర్‌పై చర్యలు తీసుకోకపోగా, సమస్యను బహిర్గతం చేసినందుకు విద్యార్థినులకు రూ. 1000 చొప్పున దండన విధించడం శోచనీయమన్నారు. ఈ సంఘటనపై వెంటనే విచారణ జరిపి అతడిపై పోక్సో, దిశ, నిర్భయ కేసులు నమోదు చేసి, విధుల నుంచి తొలగించాలని, ఇలాంటి సంఘనలు పునరావృతం కాకుండా విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరారు. లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సునీల్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న భూ నిర్వాసితులు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం వద్ద ఏర్పాటు చేసిన బెల్, నాసిన్, ఎయిర్ బస్ పరిశ్రమలకు భూములు ఇచ్చిన రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ శనివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో సువర్ణకు వినతి పత్రం అందజేశారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, పెనుకొండ నియోజకవర్గ భవన నిర్మాణ సంఘం కన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని మూడేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదన్నారు. ఇకనైనా వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పరిశ్ర మల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని, ఇంటి స్థలం ఇచ్చి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఆర్డీవో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పరిశ్రమల ప్రతినిధుల తో చర్చించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోతో పాటు తహశీల్దార్ మారుతి, సిఐ శేఖర్ పాల్గొనగా భూ నిర్వాసితులు వినతిపత్రం సమర్పించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మంత్రి భూమిపూజ

ప్రజాశక్తి-రొద్దం

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎ ంపీ

మండలంలోని దొడగట్ట గ్రామంలో శనివారం 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు మంత్రి సవిత భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఈ సబ్ స్టేషన్ ద్వారా సుమారు 6 గ్రామాల్లో గృహ, వాణిజ్య, వ్యయసాయ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడానికి వీలవుతుందన్నారు. పనులను వంద రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఎంపి బికె.పార్థసారథి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజలు సహకరిస్తే ఈ ప్రాంతంలో కూడా సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్ర, డిఈ భూపతి, వైసిపి సర్పంచి బాలాజీ, టిడిపి మండల కన్వీనర్ నరహరి, నాయకులు రామచంద్ర, నరసింహులు, సుబ్బరత్నమ్మ, మాధవ నాయుడు, జివిపి.నాయుడు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, అశ్వర్థనారాయణ, శ్రీనాథ్‌చౌదరి, పవన్, వీరాంజి, రామాంజి, దుర్గప్ప, పురుషోత్తం పాల్కొన్నారు.

రెవెన్యూ సదస్సులో పాల్గొన్న మంత్రి

దొడగట్ట పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంత్రి సవిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్ నాగేంద్రను ఆదేశించారు.

11 నుంచి మహాబీమా మేళా

ప్రజాశక్తి-హిందూపురం

బీమా సౌకర్యం పొందడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతాయని స్థానిక హెడ్ పోస్ట్ మాస్టర్ మార్కండేయులు పేర్కొన్నారు. హిందూపురం తపాలా పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో జీవిత బీమాపై అవగాహనర్యాలీ నిర్వహించారు. పట్టణ పురవీధులు గూండా ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా హెడ్ పోస్టుమాస్టర్ మాట్లాడుతూ ఎదైనా డిగ్రీ అర్హత కలిగిన ప్రయివేటు ఉద్యోగులు, వైద్యులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఇంజినీర్లు సైతం తపాలా జీవిత బీమా పొందే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 11, 12వ తేదీల్లో మహా బీమా మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పోస్టల్ కార్యాలయ వెంకటేష్, తదితర ప్రధాన తపాలా కార్యాలయ ఉద్యోగులు, పోస్ట్‌మెన్లు పాల్గొన్నారు.

ఎఎంపి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు చదువుతో పాటు విద్యార్థి దశనుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ, వాటికి పోటీపడి చదవాలని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప విద్యార్థులకు సూచించారు. అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్ (ఎఎంపి) ఆధ్వర్యంలో విద్యార్థుల ఉపకార వేతనం, వివిధ పోటీ పరీక్షల కోసం శనివారం పట్టణంలోని ఇక్రా పాఠశాలలో పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రియాజ్, ఇక్రా పాఠశాల ఛైర్మన్ నజీరుద్దీన్, హుదా పాఠశాల కరస్పాండెంట్ సాదిక్ అలీలు పాల్గొని ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఇఒ మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు ప్రవేశ పరీక్షలను నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నారని చెప్పారు. నీట్, సియుఇటి, ఐఐటి, జెఈఈ, సిడిఎస్, ఎన్‌డిఎ పరీక్షలతో పాటు జాతీయ స్థాయిలో నిర్వహించే యుపిఎస్సీ పరీక్షలకు సైతం శిక్షణ ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇక్రా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ అబీబ్ జావిద్, హెచ్ఎం షాకిర, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎపర్లను విడుదల చేస్తున్న ఎంఇఒ, పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

టిడిపితోనే బిసిలకు భరోసా

రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత - సోమందేపల్లిలో భగీరథ కల్యాణ మండపానికి భూమిపూజ

భగీరథ కళ్యాణ మండపంకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత, ఎంపి.బికె.పార్థసారథి

ప్రజాశక్తి-సోమందేపల్లి

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ద్వారా బిసిలకు అన్ని విధాలా భరోసా లభిస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖమంత్రి ఎస్.సవిత తెలిపారు. సోమందేపల్లి మండలంకేంద్రంలో రూ.80 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న భగీరథ కల్యాణ మండపం భూమిపూజా కార్యక్రమంలో ఎంపీ బికె.పార్థసారథితో కలిసి మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ యువతకు ఆర్థిక దన్ను కలిగేలా స్వయం ఉపాధి పథకాలు అందజేయనున్నట్లు తెలిపారు. సోమందేపల్లి మండలంలో రూ.5కోట్లకు పైగా నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నామన్నారు. పట్టణంలో 1.40 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం ప్రారంభించామని, త్వరలో రోడ్లు వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. సోమందేపల్లిలో నాలుగు బోర్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా పైప్ లైన్లు నిర్మించి 300 ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి సోమందేపల్లిలో ఐటిఐ తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు. తన గెలుపునకు అన్ని విధాలా తోడ్పాటు అందించిన సోమందేపల్లి మండల ప్రజల రుణం తీర్చుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. భగీరథ కల్యాణ మండపం నిర్మాణానికి సొంతంగా రూ.5 లక్షలను అందించనున్నట్లు తెలియజేశారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ కబుర్లు చెప్పిన జగన్ రెడ్డి అన్ని వర్గాల మాదిరిగా బీసీలనూ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మంజూరు చేసిన నిధులను వెచ్చించకుండా 70-80 శాతం మేర నిర్మాణాలు పూర్తయిన బీసీ భవన్లను అసంపూర్తి నిలిపేశారన్నారు. బీసీలు బాగుపడడం జగన్‌కు ఇష్టంలేదన్నారు. టీడీపీతోనే బీసీలు రాజ్యాధికారంలో భాగస్వాములు కాగలిగారన్నారు. ఎంపీ బికె.పార్థసారథి మాట్లాడుతూ భగీరథ భవనం నిర్మాణానికి సంబంధించి ఎన్నికలకు ముందు మాట ఇచ్చి ఇప్పుడు భూమి పూజతో ఆ మాటను నిలబెట్టుకున్నామన్నారు. హిందూపురం పార్లమెంటు పరిధిలోని అన్ని మండలాలను అభివద్ధి చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అనంతరం భగీరథ కళ్యాణ మండపానికి నిధులు మంజూరు చేసిన బికెను సగర కులస్తులు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్ధి లింగప్ప, వాల్మీకి డైరెక్టర్ డివి.ఆంజనేయులు, మాజీ జెడ్పిటిసి వెంకటరమణ, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి.హరి, రామకృష్ణ, సంజీవరెడ్డి, ఉప్పర సంఘ నాయకులు రామచంద్ర, బోర్ గోపాల్, రామచంద్ర, కొల్లప్ప, టిడిపి నాయకులు, సగర కులస్తులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం



న్యాయవాదులతో చర్చిస్తున్న కంపల్లె శైలజ

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండడంతో పాటు దీనిని పూర్తిస్థాయిలో కక్షిదారులకు వివరించాల్సిన అవసరం ఉందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. శనివారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో మధ్యవర్తిత్వం కీలక పరిణామంగా మారనున్నట్లు పేర్కొన్నారు. కేసులో ఉన్న ఇరువర్గాల కక్షిదారులను సమస్యపై ప్రశాంత వాతావరణంలో చర్చింపజేసి రాజీమార్గం ద్వారా న్యాయవాదులు మధ్యవర్తిత్వం వహించి పరిష్కరించేందుకు కషి చేయాలన్నారు. సివిల్ తగాదాలపై మధ్యవర్తిత్వం ఎంతో ప్రయోజనంగా దోహదపడుతుందని తెలిపారు. అనంతరం జరిగిన లోక్ అదాలత్‌లో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ఏపీపీ ఇందాద్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప, సీనియర్ న్యాయవాదులు రఘునాథ్ రెడ్డి, సిద్దు, సత్యనారాయణ, యూసుఫ్, సందీప్, వేణుగోపాల్, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి పాల్గొన్నారు.

ఫిర్యాదుపై తక్షణ స్పందన..!

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రధాన గేటు సమీపంలో కళాశాల హాస్టల్ పక్కన అపరిశుభ్రత పేరుకుపోవడం, పందులు స్వైర విహారం చేస్తూ దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రగతి, విద్యార్థినిలు శనివారం మున్సిపల్ ఛైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ సంఘం శ్రీనివాసులు దష్టికి వాట్సప్ ద్వారా తెలియజేశారు. ఇందుకు ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్లు వెంటనే స్పందించి అక్కడ పరిశుభ్రత పనులు చేయించారు. పారిశుధ్య సిబ్బందిని పంపించి కళాశాల పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. ఫిర్యాదు చేసిన వెంటనే సమస్యను పరిష్కరించడం పట్ల మున్సిపల్ అధికారులు, ఛైర్మన్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించండి : ఎమ్మెల్యే పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పిల్లలను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై ఉందన్నారు. మొబైల్‌ను విపరీతంగా వాడడం వల్ల మంచి కంటే చెడు ఎక్కువగా జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల అశ్రద్ధ వహిస్తే పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టు కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. విద్య వల్ల జరిగే మంచి, సెల్ వాడకం వల్ల జరిగే నష్టంపై విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్‌ఎం వాణిబాయి, సర్పంచి రాధమ్మ, ఎస్ఎంసి ఛైర్మన్ భాస్కర్, ఐఎఫ్ఎస్‌సి మోహన్‌రెడ్డి, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ లాజరు, ఎంపీడీవో నటరాజు, ఎంఇఒ జయచంద్ర, మాజీ ఎంపీపీ వాణి, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకన్న, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్. శ్రీనివాస్, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఉపాధ్యాయులు విశ్వేశ్వరరావు, ఇర్షాద్‌వలి పాల్గొన్నారు.

పుట్టపర్తిరూరల్ : పిల్లలను సక్రమంగా పాఠశాలకు పంపించే బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారున. మండలంలోని పెడపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు సన్మార్గంలో పయనించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు.

బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు

పెడపల్లి ఉన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి నెలా బహుమతులు ప్రదానం చేస్తారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించి విద్యార్థులకు స్వెటర్లు, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణి, చెన్నకృష్ణారెడ్డి, గోపాల్‌రావు, సోమశేఖర్, రాజు, రామ్మూర్తి, సుగుణమ్మ, ఎస్ఎంసి ఛైర్మన్ బాబునాయక్, నాయకులు విజయ కుమార్, శ్రీరామ్‌నాయక్, బొమ్మయ్య, శివప్ప, కుళ్లాయప్ప, నాగరాజు పాల్గొన్నారు.

ఒడిసి మండలం కొండకమర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పోలీసులు

ఓబుళదేవరచెరువు : పిల్లల భవిష్యత్తు కోసం మనమంతా ముందడుగు వేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కొండకమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి సన్మార్గంలో నడుస్తూ ఉజ్వల భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవా లని సూచించారు. మొబైల్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పోటీల విజేత విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, ఎంఇఒలు సురేష్, రమణ, ఎస్ఎంసి ఛైర్మన్ రవి, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, డాక్టర్ జాకీర్, రాజారెడ్డి, అంజనప్ప, ఇర్షాద్, షానవాజ్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

టిడిపి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడు తూ టిడిపి అధికారంలోకి వచ్చి 6 నెలలైనా సందర్భంగా అభివృద్ధి పనులపై నూతన క్యాలెండర్ ముద్రించామన్నారు. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న పథకాలను అందులో ముద్రించామన్నారు. అనంతరం సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ క్యాలెండర్‌ను ఆయన చేత ఆవిష్కరించారు.

పత్తి సరోజమ్మ మృతికి నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ మాతృమూర్తి పత్తి సరోజమ్మ శనివారం మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఎంపి బికె.పార్థసారథి అనంతపురంలోని పత్తి చంద్రశేఖర్ నివాసానికి వెళ్లి సరోజమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. నియోజకవర్గంలోని జనసేన, టిడిపి నాయకులు, ముఖ్యులు నివాళులర్పించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఇటీవల విశాఖపట్నంలో మదర్ థెరెసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుబ్రహ్మ అవార్డు పొం దిన విశ్రాంత ఉపాధ్యాయుడు బొల్లె వెంకటరమణను శనివారం ఎంఇఒ–2 బొల్లె ప్రసాద్, ఎమ్మార్సీ సిబ్బంది నాగరాజు, రామ్మోహన్, పాత్రికేయుడు నిడిమామిడి కష్ణమూర్తి సన్మానించారు. ఎంఇఒ మాట్లాడుతూ వెంకటరమణ గతంలో విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీలకు మంగళకర విద్యార్థి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తమిళనాడులోని మద్రాస్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీలకు మండలంలోని జగరాజుపల్లిలో ఉన్న మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. బి.కాం ద్వితీయ సంవత్సరం చదువుచున్న ఎం.సాయి విజేష్ ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకూ మద్రాస్ యూనివర్శిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ హాకీ పోటీల్లో ఎస్‌కె యూనివర్శిటీ జట్టు తరపున పాల్గొంటాడన్నారు. విద్యార్థిని కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యప్రకాష్, ఏవో జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, పిడి శ్రీనివాసులు అభినందించారు.

సాయి విజేష్

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం మండలంలోని అమిదాలగొంది పంచాయతీకి చెందిన భాస్కర్‌రెడ్డి, కోట్ల రంగేగౌడ్, గోపాలరెడ్డి, రామకృష్ణ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలోకి చేరారు. మల్లేశప్ప, బాలచంద్ర, వరదరాజులు, నాగిరెడ్డి, రవి, సుబ్బరాయప్ప, నరసప్ప, దాసప్పకు గుండుమల టిడిపి కండువా వేసి ఆహ్వానించారు.

గుండమల సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి : ఎంపి

ప్రజాశక్తి-పెనుకొండ

విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎంపి బికె.పార్థసారథి పిలుపునిచ్చారు. పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యా యుల ఆత్మీయ సమావేశంలో ఎంపి పాల్గొని మాట్లాడారు. పిల్లలపై స్మార్ట్‌ఫోన్ల దుష్ప్రభావం ఎక్కువైందన్నారు. పిల్లలను ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి పుస్తకాలు చదవడం, వ్యాయామం, క్రీడలు, డ్రాయింగ్, డాన్స్, పాటలు పాడటం, మొక్కలు పెంచడం, వాటిని సంరక్షించడం వంటి వాటిని అలవాటుగా ఎంచుకోవాలన్నారు. సైబర్, డ్రగ్స్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారున. సమావేశంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి బికె పార్థసారథి

ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి : డిటిఎఫ్

ఎమ్మెల్యే సింధూరకు వినతి ఇస్తున్న డిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఉపాధ్యాయుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఓడి చెరువులో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఉపాధ్యాయుడి మృతి బాధాకరమన్నారు. ఆ సంఘటనపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని కొండకమర్లకు వచ్చిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కట్టుబడి గౌస్ లాజమ్, మండల ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌నాయక్, నాయకులు నాగరాజు, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులు దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

దృఢ సంకల్పం ముందు వికలాంగత్వం దాసోహం అవుతుందని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌డిటి పాఠశాలలో శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ దివ్యాంగులు చట్టాలను మరింత కఠినతరం చేయాలని, వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం దివ్యాంగులకు రైల్వే పాసులు, యూనిక్ ఐడి కార్డులు, సబ్సిడీ రుణాలు, బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్ అందించారు. కార్యక్రమంలో శ్రీరామ్‌నాయక్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానుజులనాయుడు, సంఘం సభ్యురాలు గంగాదేవి, వెలుగు సిసి చంద్రారెడ్డి, వెంకటరమణ, ఆర్‌డిటి సిబ్బంది నాగరాజు, గీత, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు భోగశెట్టి గజేంద్ర, రెడ్డెప్ప, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు రైల్వే పాసులు అందజేస్తున్న అధికారులు

సత్యసాయి విదేశీ భక్తుల ఔదార్యం

సరుకులు పంపిణీ చేస్తున్న విదేశీ మహిళలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని శ్రీవాణి బ్లోసమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్యసాయి భక్తులైన విదేశీ మహిళలు ఔదార్యంతో పేద మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముందుగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రసాదాలు, పండ్లు పంపిణీ చేశారు. బుక్కపట్నం గ్రామానికి చెందిన 51 మంది నిరు పేద మహిళలకు కందిపప్పు, వంటనూనె, చక్కెర, బెల్లం, గోధుమపిండి, వేరుశెనగ విత్తనాలు, తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. అంతకుముందు శ్రీసత్యసాయి భజన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పాఠశాల ఆవరణలో విదేశీ మహిళలు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో శ్రీవాణి శ్రీనివాస్, హెచ్‌ఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంకర ఫ్యాక్టరీని రద్దు చేయాలని ఎంపికి వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న కంకర ఫ్యాక్టరీని రద్దు చేయాలని కోరుతూ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఎంపి బికె.పార్థసారధికి వినతి పత్రం అందజేశారు. పట్టణంలో భగీరథ కళ్యాణ మండపం ఏర్పాటుకు భూమిపూజ చేసేందుకు ఎంపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దీంతో బాధితులు ఎంపిని కలిసి కంకర ఫ్యాక్టరీ వల్ల సుమారు 2 వేల ఎకరాల్లో పంట నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కమ్మ గారి ఆలయం పవిత్రతను దెబ్బతీస్తున్నారని తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్ము ధూళి వల్ల నాగినిచెరువు తండాలో నీరు కలుషితం అవుతున్నాయన్నారు. పశువులకు మేత లేకుండా పోతుందన్నారు. ఇష్టారాజ్యంగా మందు సామగ్రి పేల్చడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, పంటలు పండక ఊర్లు వదిలేసిన పరిస్థితి ఏర్పడుతోందని, ఫ్యాక్టరీని రద్దు చేయాలని కోరారు.


ఎంపి పార్థసారథికి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన

ప్రజాశక్తి-కదిరి టౌన్

మత్తు కంటే భవిష్యత్తు ముద్దు అని హరీష్ స్కూల్ ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో శనివారం ప్రిన్సిపల్ అధ్యక్షతన పోలీసులు డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కదిరి రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, బెట్టింగ్, గ్యాంబ్లింగ్, సైబర్ నేరాలు, తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. 'చెడు వ్యసనాలకు దూరంగా ఉంటాం.. బంగారు భవిష్యత్తును కాపాడుకుంటాం' అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్

మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

అధ్వానంగా మధ్యాహ్న భోజనం 'పిటిఎం'లో విద్యార్థుల ఫిర్యాదు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం వడ్డించిన మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మెగా మీటింగ్(పిటిఎం)కు వెళ్లి మధ్యాహ్న భోజనం అధ్వాన్నంగా ఉందని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, విధిలేని పరిస్థితుల్లో ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏజెన్సీని మార్చి మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని కోరారు. లేనిచో ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

పిల్లల భవిష్యత్తు బాధ్యత ఉపాధ్యాయులదే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని బుల్లసముద్రం జడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన పేరెంట్స్, టీచర్స్ మెగా సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఈ పాఠశాలలో ఆడపిల్లలకు రెస్ట్ రూమ్‌ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విశ్వనాథ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం వ్యాప్తంగా బ్యాంకుల ద్వారా రుణాలు విరివిగా అందించి వెనుకబడిన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు మెప్మా సిబ్బందికి సూచించారు. శనివారం మెప్మా జిల్లా అధికారులు భవాని, కాటమయ్యలు హిందూపురం పురపాలక సంఘం మెప్మా విభాగాలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మెప్మాలో అములవుతున్న మహిళా సంఘాల ప్రొఫైలింగ్, సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే, పీఎం స్వా నిధి రుణాలు, సూర్య ఎకనామిక్ సర్వేలో హిందూపురం పురపాలక సంఘం ముందంజలో ఉండడంతో సిబ్బందిని అభినందించారు. అనంతరం వారు కమిషనర్ సంఘం శ్రీనివాసులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా మహిళలకు రుణాలు ఇప్పించడం తో పాటు వారి ఆదాయ అభివద్ధికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో టిఎంసి గంగులయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు నాగేశ్వరి, పరంజ్యోతి, తౌసీఫ్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామసురరెడ్డి తెలిపారు. రైల్వే పనులతో పాటు మెయింటెనెన్స్ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతారాయం ఉంటుందని తెలిపారు.

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుడిబండ

నూతన ఎస్ఐ రాజకుల్లాయప్పను శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, న్యాయవాది శివకుమార్, నాయకులు లక్ష్మీ నరసప్ప, షబ్బీర్, శ్రీరామప్ప పాల్గొన్నారు.

హత్యాయత్నం, వేధింపుల కేసులో జైలు, జరిమానా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

హత్యాయత్నం, కట్నం వేధింపుల కేసులో నలుగురు నిందితులకు అనంతపురం సెషన్స్ జిల్లా కోర్టు జడ్జి శోభారాణి శనివారం మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. ముదిగుబ్బ మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవరెడ్డి కూతురు స్రవంతికి కొత్తచెరువు గ్రామంలోని దర్గా వీధికి చెందిన ఓం ప్రకాష్‌తో 2015లో వివాహం చేశారు. పెళ్లి సమయంలో 10 తులాల బంగారు ఇచ్చారు. అయితే అత్తింటి వారు అదనపు కట్నం కోసం స్రవంతిని శారీరకంగా, మానసికంగా వేధించంతో పాటు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు 2017లో అప్పటి కొత్తచెరువు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి అనంతపురంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి శోభారాణి జైలు శిక్ష, జరిమానా విధించారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

పిల్లలకు బాగా చదువు రావాలంటే ఉపాధ్యాయుల కంటే తల్లిదండ్రులే ఎక్కువ శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండలంలోని కుంటిమద్ది గ్రామ పాఠశా లలో శనివారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతీదేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్న సందేశంతో రూపొందించిన 'మాదక ద్రవ్యాలు వద్దు బ్రో' పోస్టర్లను ఆవిష్కరించారు. తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేష్ ఎన్నో మార్పులు తీసుకొస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో మాత్రమే చదువు చెబుతారని, మిగిలిన సమయంలో తల్లిదండ్రులే ఎక్కువ బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ. లక్ష విరాళం ప్రకటించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

పిల్లల్లో సమాజంపై బాధ్యత పెంచాలి

పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థి దశలోనే సమాజం పట్ల బాధ్యత పెంపొందేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల ను తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సూచించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యం కారణంగా రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరిగాయని, తద్వారా చదువుకునే విద్యార్థులు సైతం గంజాయి బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి ప్రభుత్వ వైఫల్యమే నేడు ఉపాధ్యాయులపై పిల్లలు తిరగబడే దుస్థితి ఏర్పడింద న్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు సరైన మార్గంలో ముందుకుసాగేలా ఇంట్లో, పాఠశాలలో వారిపై దృష్టి సారించాలన్నారు. పాఠశాలకు ప్రహరీ ఏర్పాటుకు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటసన్యాసిశర్మ, ఎంఇఒ, హెచ్‌ఎం, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై శనివారం పట్టణంలోని కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానంలో కదిరి డివిజన్‌లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు వివిధ పంటల్లో వచ్చే తెగుళ్లు, చీడపురుగులు, వాటి నియంత్రణపై వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ పంటలను ఆశించే చీడపీడల నివారణపై ఆర్ఎస్‌కె సిబ్బంది రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎంఐపి పిడి, ఎడిఎలు సనావుల్లా, సత్యనారాయణ, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, ఆర్ఎస్‌కె సిబ్బంది, ఎంపిఇఒలు పాల్గొన్నారు.

అవినీతి యానిమేటర్లను తొలగించండి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న యానిమేటర్లను వెంటనే తొలగించాని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ ఎపిఎం హేమలతను కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం మనోహర్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో నియమించిన యానిమేటర్లు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు పలు ఫిర్యాదులు అందినా వారిని కొనసాగించడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై ఎపిఎం హేమలత మాట్లాడుతూ మండలంలోని యానిమేటర్లపై విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిననట్లు రుజువైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిపై క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు.

ఎస్‌బిఐ ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

ప్రజాశక్తి-పెనుకొండ

ఎస్‌బిఐ ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని నెట్‌వర్క్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో శనివారం ఎస్‌బిఐ పెనుకొండ శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారులతో సమావేశం నిర్వహించి వారి నుంచి పల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 18001234ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ కర్నూల్ దినేష్ కుమార్ గులాటి, రీజినల్ మేనేజర్ డి.శశిధర్ కుమార్, చీఫ్ మేనేజర్ మహేష్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

దళిత కుటుంబం దీక్షకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-గాండ్లపెంట

భూమి సమస్యపై మండలంలోని కటారుపల్లికి చెందిన దళిత కుటుంబం చేస్తున్న దీక్షకు శనివారం సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, పారిశుధ్య కార్మిక సంఘం మండల కన్వీనర్ అక్కులప్ప, నరసింహులు, దొడ్డప్ప మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ వెంకటరమణ, గంగాద్రి తమ పొలంలో పనులు చేసుకుంటుండగా వెంకటరమణరెడ్డితో పాటు మరికొందరు అడ్డుకుంటున్నారన్నారు. వారిపై గతంలో గ్రామసభలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌ఛార్జి ఎస్ఐ రాజీ చేశారన్నారు. అయితే తహశీల్దార్ పెత్తందారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి దళిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ధర్మవరం బిజెపి ఆఫీస్ ఇన్‌ఛార్జి హరీష్ బాబు, ఎంపిడిఒ రంగారావు తెలిపారు. వారు మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్ సత్యకుమార్ ఆదేశాల మేరకు గ్రీవెన్స్ డే నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. ఆయా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాము, విశ్వనాథనాయుడు, కేశవ, నారాయణ, అశ్వత్థనారాయణ, రాజు, రమణ, రేణుక పాల్గొన్నారు.

దుర్ఘటనలు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఈ వారంలో వరుసగా విషాద దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. రోడ్డు ప్రమాదాల రూపంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. వర్షాలతోనూ ఇళ్లు కూలి ముగ్గురు మృతివాతపడ్డారు. రహదారి ప్రమాదాలు ఈ మధ్య కాలంలో జిల్లాలో పెరిగాయి. అంతకు మునుపు వారంలో ఆటో ప్రమాదంలో ఎనిమిది వ్యవసాయ కూలీలు మృతి చెందారు. ఈ వారంలో కారు ప్రమాదంలో ముగ్గురు వైద్యులు బలయ్యారు. ఇటువంటి ఘటనలు వరుసగా జరగడం గమనార్హం. రోడ్డు ప్రమాదాలపై ఒకవైపు అవగాహన కార్యక్రమాలను అధికార యంత్రాంగం చేపడుతున్నప్పటికీ ఇవి చోటు చేసుకుంటూనే ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల మూలంగా ఏడాదిలో సగటున 300 మందికిపైగా మృత్యువాతపడుతున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. రోజుకు సగటున ఒకరు చొప్పున ఈ ప్రమాదాల్లో చనిపోతున్నారు. ఇందులో అత్యధిక ప్రమాదాలు చూసినప్పుడు చలికాలంలోనే ఎక్కువగా ఉంటున్నాయి. ప్రధానంగా నవంబర్ నుంచి జనవరి మధ్యకాలంలో ప్రమదాలు అధికంగా ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. దీనికి కారణం మంచు ఉంటోంది. మంచు కారణంగా రహదారి స్పష్టంగా కనిపించగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ వారంలో విడపనకల్లు వద్ద జరిగిన కారు ప్రమాదం కూడా మంచుకారణంగానే జరిగినట్టు పోలీసులు అంచనా వేశారు. ఈ ప్రమదాలు అనేక మంది జీవితాల్లో తీరని విషాదాన్నే మిగులుస్తున్నాయి. ఈ వారంలో జరిగిన మరో దుర్ఘటన వర్షం కారణంగా కుందుర్పి మండలంలో ఇళ్లు కూలి ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఈఘటనలో మరణించిన వారు భార్యాభర్తలు, కుమార్తె కావడం విచారకరం.

ఈ వారంలోనూ తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజులపాటు ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. వరి, మొక్కజొన్న తదితర పంటలపై ఈ వర్షప్రభావం కొంత వరకు కనిపించింది. నష్టమూ చేకూర్చింది. ఇక ఈ వారంలో హంద్రీనీవా రెండో దశకు నిధుల కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వమిచ్చిన ఉత్తర్వులు చర్చనీయాంశం అయ్యాయి. ఎందుకంటే మొదటి విడత కాలువ వెడల్పు చేపట్టకుండా రెండో దశ లైనింగ్ ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విపక్షాలు దీన్ని తప్పుబడుతున్నాయి. మొదటి దశ కాలువ వెడల్పును గత ప్రభుత్వం ప్రకటంచిన విధంగా ఆరు వేల క్యూసెక్కులతోనే చేపట్టాలని, రెండో దశ లైనింగ్ చేపట్టకూడదని కోరుతున్నారు. లైనింగ్ చేపట్టడం వలన అనంతపురం జిల్లాలో లాభం కంటే నష్టమే అధికమంటున్నారు. ఎందుకంటే కాలువ ద్వారా వెలితే భూగర్భ జలాలు కొంత వరకు పెరిగే అవకాశముందంటున్నారు. దీని వలన ఆయా ప్రాంతాల్లో బోరుబావులపై ఆధారపడి పంటలు సాగు చేసుకునే వారికి ప్రయోజనం ఉంటుందంటున్నారు. ఆధునీకరణ అవసరమైన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు మాత్రం నిధులు కేటాయించకుండా మరమ్మతులకే పరిమితం చేయడాన్ని తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పై నిర్ణయాన్ని పున:సమీక్షించాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని రైల్వే బాలుర హైస్కూల్‌లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన చదువు అందిచ డం వల్ల వారు ఉన్నతస్థాయికి ఎదుగుతారని, తద్వారా ఉపాధ్యాయులకు ఎంతో పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువు, ప్రవర్తనలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం మానస నృత్య కళా కేంద్రం శిష్య బృందం చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ మానస, ఉపాధ్యాయులు రామకృష్ణ, విజయ్‌నాయక్ పాల్గొ న్నారు. మండలంలోని ధర్మపురి గ్రామ ఎంపియుపి పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాలను విద్యార్థులు ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమం ఉద్దేశ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

గాండ్లపెంట : విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖులు సూచించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పలువురు ముఖ్యులు పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్ర మంలో కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, ఎఎస్‌ఐ రంగనాయక, ఎంఇఒలు కృష్ణానాయక్, శ్రీనివాసులు, హెచ్‌ఎం సిద్ధారెడ్డి, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్‌అలీ, గంగాధర్, చిన్నప్పయ్య, విశ్వనాథ్‌రెడ్డి, రాజగోపాల్, ఎస్‌ఎంసి ఛైర్మన్ రెడ్డినాయక్, డిఆనంద్, నాయకులు వెంకటరమణారెడ్డి, పాల్గొన్నారు.

అగళి : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల, కెజిబివి, మోడల్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ ఉమేష్ ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు.

పరిగి : పాఠశాల, విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఎంఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం సూచించారు. మండలంలోని అన్ని జడ్పీ హైస్కూళ్లలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పరిగి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమా లు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యరాజ్, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసి ఛైర్మన్ అశ్వత్థ, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండలంలోని ప్రభుత్వ పాఠశాల ల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిం చారు. ఎంఇఒ గోపాల్‌నాయక్ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరిం చారు. సమావేశంలో మాజీ సర్పంచి సాకే యశోద, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, గోపాలపురం గంగాధర్, సయ్యద్ బాషా, హెచ్‌ఎం, ఎస్‌ఎంసి ఛైర్మన్ పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, రామాపురం జడ్పీ హైస్కూ ల్‌లో మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. పిల్లలను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై ఉందన్నారు. పోలీసులు నేరాలు, బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయంతి, ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, గౌరవాధ్యక్షులు జక్కంపూడి నాగభూషణ, ఎస్‌ఎంసి మెంబర్లు, రామాపురం హెచ్‌ఎం వెంకటనాయుడు, ఎస్‌ఎంసి ఛైర్మన్ రాజకుళ్లాయప్ప, వైస్ ఛైర్మన్ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మెగా సమావేశాలను శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లను ఆవిష్కరించారు.

అగళిలో సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అమడగూరులో సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్లు ఆవిష్కరణ

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని, సమిష్టి కృషితో డ్రగ్స్‌ను కట్టడి చేద్దామని ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ పిలుపునిచ్చారు. మండలంలోని సంజీవపురం వద్ద ఉన్న కెజిబివిలో ప్రిన్సిపల్ బి.గుల్జార్‌బేగం అధ్యక్షతన మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సిఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి ఛైర్మన్ ముంతాజ్‌బేగం, టిడిపి నాయకులు అయ్యప్ప, ఎఎన్‌ఎం శ్రీలత, సైబర్ నెట్‌వర్క్ కానిస్టేబుల్ శోభ పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలంలోని కొనుకుంట్ల గ్రామ హైస్కూల్‌లో ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్లు ఆవిష్కరించారు.

హిందూపురంలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప

బత్తలపల్లిలో విద్యార్థినికి పురోగతి కార్డులు అందజేస్తున్న పోలీసు అధికారులు

తలుపుల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎస్ఐ నరసింహుడు పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరన్న, ఎస్‌ఎంసి ఛైర్మన్ ఎద్దుల రాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొద్దం : మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వశించారు. సానిపల్లి ఎంపియుపి పాఠశాలలో హెచ్‌ఎం చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో మెగా పిటిఎం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కెజిబివి, కల్లకుంట, రొద్దంతో పాటు పలు పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథులను మండల నాయకులు హహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, ఎంఇఒ-2 జయభాస్కర్, ఉపాధ్యాయులు నారాయణస్వామి, మల్లికార్జున, బాలాజీ, గోకుల్, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండలంలోని దేవలంతండా ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.రెడ్డప్ప ముఖ్య అతిథిగా హాజరై సందేశం ఇచ్చారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో వందేమాతరం టీం సభ్యులు బాగేపల్లి చలపతి, హెచ్‌ఎం అలీ, ఎస్‌ఎంసి ఛైర్మన్ రవి, ఉపాధ్యాయులు శివశంకర్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారా యణయాదవ్ హాజరై సందేశం ఇచ్చారు. సమావేశంలో ఎంఇఒ రమణప్ప, హెచ్‌ఎం రమాదేవి, టిడిపి మండల కన్వీనర్ ప్రభాకర్, కోట్ల బాబి, ఎస్‌ఎంసి ఛైర్మన్ సూరి, పిడి రేఖ, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సిఐ జి.శివరాముడు ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్లను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమడగూరు : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం శ్రీధర్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒ జిలాన్ బాషా, ఎస్ఐ వెంకటనారాయణ హాజరై సందేశం వినిపించారు. ఆటలు పోటీల నిర్వహించిన విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో ఎస్‌ఎంసి ఛైర్‌పర్సన్ శారదమ్మ, వైస్ ఛైర్మన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశా లల్లో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండ లంలోని కల్లురొప్పం గ్రామంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులకు జ్ఞాన వృక్ష ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వరప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్ర మంలో ట్రస్ట్ తరపున వరప్రసాద్, మహదేవప్ప, శివన్న, రవి కుమార్, హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఎంసి ఛైర్‌పర్సన్ రాధ మ్మ, దుర్గేష్, శశిధర్, షబ్బీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లమాడ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి సన్మార్గంలో ఉజ్వల భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొబైల్‌కు దూరంగా ఉండాల న్నారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ వేమనారాయణ, సురేష్‌బాబు, లక్ష్మీనారాయణరెడ్డి, మోహన్, లీలావతి, పద్మావతి, అరుణ, రేఖ పాల్గొన్నారు.

గుడిబండ : డ్రగ్స్‌ను పారదోలండి.. పిల్లలను కాపాడుకోవాలని ఎస్ఐ రాజకుళ్లాయప్ప సూచించారు. మండలంలోని పిసి గిరి పాఠశాలలో ఎస్ఐ మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : మండలంలోని కోరెవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో హెచ్‌ఎం అశోక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మలసముద్రం గ్రామపంచాయతీ సర్పంచి సువర్ణ అశ్వర్థరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రాధా, కృష్ణవేణి, కిషోర్‌కుమార్, శ్రీదేవి జరుపుకున్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ఎపి ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు పాల్గొని విద్యార్థులకు పురోగతి కార్డులు అందజేశారు.

పుట్టపర్తి రూరల్ : మండలంలోని కొట్లపల్లి పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా తెలుగు యువత నాయకులు కొట్లపల్లి నారాయణస్వామి పాల్గొని మాట్లాడారు. పాఠశాల ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బోధన, తదితర వాటిపై చర్చించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగిశెట్టి, ఎస్‌ఎంసి ఛైర్మన్ నరసింహులు, నాయకులు నరసింహులు, రామప్ప, ఉపాధ్యాయులు రాంప్రసాద్, లక్ష్మీనారాయణరెడ్డి, మునేంద్ర పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో సువర్ణ విద్యార్థులకు చదువు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, సిఐ శేఖర్, హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులే దేశ సంపద : ఎంఇఒ

హిందూపురం : పట్టణంతో పాటు రూరల్ మండల వ్యాప్తంగా 118 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ,కేజీబీవీ రెసిడెన్షియల్ మోడల్ స్కూల్ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మెగా సమావేశాలను శనివారం నిర్వహించారు. పట్టణంలోని మధర్ థెరీసా ప్రాథమికోన్నత పాఠశాల, మండల విద్యాధికారి గంగప్ప మిట్టమీద పల్లి, కేజీబీవీ, ఎంజీఎం, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ మున్సిపల్ పాఠశాలలను తనిఖీ చేసి కార్యక్రమాన్ని పరిశీలన చేశారు. కౌన్సిలర్ రమేష్ కుమార్ ఎంజీఎం, దుర్గాబాయి దేశ్ ముఖ్, ఊర్దు పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పాఠశాల కమిటీ ఛైర్మన్లు, టిడిపి నాయకులు, ఆయా వార్డు కౌన్సిలర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్మవరంలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న హరీష్‌బాబు

గుడిబండలో డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

రొద్దంలో సమావేశంలో పాల్గొన్న అధికారులు

గోరంట్లలో విజేతకు బహుమతి అందజేస్తున్న ఆర్డీవో సువర్ణ